క్లుప్తంగా

మునగపాక గ్రామాభివృద్ధికి పాటుపడాలి



పాలకవర్గ సభ్యులతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: రాజకీయాలకు అతీతంగా మునగపాక గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. రెండు రోజుల పాటు అరకులోయ విహారయాత్రకు బయలుదేరిన పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆయన్ను శనివారం కలిశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గ సభ్యులు పాటుపడాలన్నారు. కనీస సదుపాయాలు కల్పించేలా కృషి చేయాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు మళ్ల కుటుంబీకుల ఆత్మీయ కలయిక

మునగపాక: వాడ్రాపల్లి పారిపల్లెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మళ్ల కుటుంబీకుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని నిర్వాహకులు మళ్ల వరహా నరసింగరావు, మళ్ల కన్నుంనాయుడులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మళ్ల కుటుంబ సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు వింటున్న మండల స్థాయి అధికారుల బృందం

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వచ్చిన అర్జీలకు సంబంధించి రెండు వర్గాలతో ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోలేని సమస్యలు త్వరితగతిన పరిష్కారం కాగలవన్నారు. ఇరు వర్గాల వారు సయమనం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఏఎస్ఐ దొర, డీటీ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



దిబ్బపాలెం సెజ్ కాలనీలో ఎన్టీఆర్‌కు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం: మండలంలోని ఎస్ఈజడ్ కాలనీ దిబ్బపాలెంలో శనివారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, రాష్ట్ర రహదారి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు నివాళులర్పించారు. బైలపూడి రాందాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాబ్జి, దొర, దినబాబు, పవన్, విజయ్, తుమ్మల రాజు, లాలం తాతారావు, రుత్తల కనకారావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని గణపర్తి, చూచుకొండ గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఘన నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. మునగపాకలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పేదలకు దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. కర్రి సాయికృష్ణ, దాడి ముసిలినాయుడు, పెంటకోట విజయ్ పాల్గొన్నారు.


కోటవురట్ల/ఎస్.రాయవరం: దివంగత సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని గొట్టివాడ గ్రామంలో టీడీపీ నాయకుడు సుంకర బాబ్జీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్.రాయవరం గురజాడ ఆడిటోరియంలో ఎన్టీఆర్ ఫ్లెక్సీకి పూలమాల వేసి నాయకులు వెంకటేశ్వరరావు, మంచాల నానాజీ, బత్తుల వాసు, భీమరశెట్టి సత్యనారాయణ, కర్రి శ్రీను నివాళులర్పించారు.

ఘనంగా సీతారాముల తీర్థం

కశింకోట: మండలంలోని జోగారావుపేట, గొబ్బూరు గ్రామాల్లో శనివారం సీతారాముల తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తినుబండారాలు, ఆట వస్తువుల అమ్మకాలు జోరుగా సాగాయి. తోడ పెద్దు సేవలు నిర్వహించారు.

ఆయిల్ పామ్.. ఆశాజనకం

తగ్గిన గెలల దిగుబడి | ధర మాత్రం పెరుగుదల



ఆయిల్ ఫ్యాక్టరీ కోసం కోసిన ఆయిల్ పామ్ గెలలు

పాయకరావుపేట: ఆయిల్ పామ్ గెలలు ధర ఆశాజనకంగా ఉంది. కొబ్బరి, అరటి, చెరకు, తదితర పంటలకు అధికంగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఏర్పడుతోంది. వాటితో పోల్చుకుంటే పామాయిల్ తోటలకు పెట్టుబడి తక్కువగానే ఉంటుంది. పాయకరావుపేటలో 50 మంది రైతులు 150 ఎకరాల్లోను, నక్కపల్లి మండలంలో 20 మంది రైతులు 65 ఎకరాల్లోను, ఎస్.రాయవరం మండలంలో 100 మంది రైతులు 250 ఎకరాల్లోను, కోటవురట్ల మండలంలో 200 మంది రైతులు వెయ్యి ఎకరాల్లోను ఆయిల్ పామ్ తోటలను పెంచుతున్నారు. ప్రతి నెలకు ఒక్కసారి పామాయిల్ గెలలు కోతకు వస్తుంటాయి. గతేడాది ఆయిల్ పామ్ గెలలు టన్ను ధర రూ.11 వేల నుంచి రూ.12 వేల మధ్య ఉండగా, ప్రస్తుతం రూ.20,300గా ఉంది. ప్రతినెలా కోసిన గెలలను కొనుగోలు చేయడానికి కోటవురట్ల మండలంలో రెండు చోట్ల, పాయకరావుపేట మండలంలో రెండు చోట్ల, ఎస్.రాయవరం మండలంలో ఒక చోట తూనిక కాటాలను ఏర్పాటు చేశారు. రైతులు కోసిన పామాయిల్ గెలలను కాటాల్లో తూకం వేసి పెద్దాపురం ఆయిల్ ఫ్యాక్టరీకి తరలిస్తుంటారు. ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు ప్రతీ వారం, పది రోజులకు రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తోంది. ప్రస్తుతం గెలలు దిగుబడి తగ్గినప్పటికీ రేటు ఆశాజనకంగా ఉందని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఆయిల్ పామ్ తోటలు

10 రోజుల్లో రైతులకు చెల్లింపులు



పామాయిల్ తోటలు వేసే రైతులకు నాలుగు సంవత్సరాల వరకు ఎరువులు ఉచితంగా సరఫరా చేస్తాం. రైతులకు ఎరువుల ఖర్చుగా రూ.5,250 అందిస్తాం. ప్రస్తుతం ధర ఆశాజనకంగా ఉంది. రైతులు మరింతగా తోటలు వేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. రైతులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రతీ పది రోజులకు వారి ఎకౌంటుకు నగదు జమవుతోంది. – తోట చంద్రశేఖర్, సీనియర్ మేనేజర్, ఆయిల్ పామ్ ప్లాంటేషన్ పతంజలి ఫుడ్స్, విశాఖపట్నం జిల్లా

పెద్దాపురం ఫ్యాక్టరీకి గెలలు పంపిస్తాం



నేను 6.5 ఎకరాల్లో ఆయిల్ పామ్ వేసాను. ప్రస్తుతం ధర ఆశాజనకంగా ఉంది. ఏటా ఆయిల్ పామ్ తోటలకు మూడు సార్లు ఎరువులు వేయాలి. నెలకు ఒక్కసారి నీరు పెట్టాలి. 15 రోజులకు, నెలకు గెలలు కోస్తే నెలకు ఎకరాకు టన్ను గెలలు వస్తాయి. ఇక్కడ కాటాల ద్వారా పెద్దాపురం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి పంపిస్తాం. ప్రతీ పది రోజులకు ఫ్యాక్టరీ నుంచి రైతుల బ్యాంకు అకౌంటుకు జమవుతోంది. – పెనుమత్స నాగేశ్వరరావు, రైతు, మంగవరం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



అహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సన్నిధిలో పూర్వ విద్యార్థులు

మునగపాక: పాటిపల్లిలోని అహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణం పూర్వ విద్యార్థులతో సందడిగా మారింది. తోటాడ జెడ్పీ హైస్కూల్‌లో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఒకరికొకరు పలకరించుకొని నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని సంతోష పర్వం చెందారు. నాడు విద్య నేర్పిన గురువులతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం అంతా సహపంక్తి భోజనాలు చేశారు. ఈ ఆత్మీయ సమావేశానికి పూర్వ విద్యార్థి శరగడం రవికుమార్‌తో పాటు ఇతరులు నేతృత్వం వహించారు.

రేపు నరేంద్రపురంలో రీ-సర్వే



ర్యాలీలో తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: నరేంద్రపురంలో ఈ నెల 20న రీ-సర్వే ప్రారంభమవుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా నరేంద్రపురానికి ఎంపిక చేశామన్నారు. ఈ మేరకు శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉప సర్పంచ్ బోజా శ్రీనివాసరావు, రీ-సర్వే డీటీ పడాల్, రైతులు ర్యాలీలో పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

డొంకాడలో నేత్రపర్వంగా వేంకటేశ్వర స్వామి వేడుక



కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు

నక్కపల్లి: డొంకాడ గ్రామంలో వేంకటేశ్వర స్వామివారి కల్యాణం శనివారం నేత్రపర్వంగా జరిగింది. ఏటా సంక్రాంతి అనంతరం వచ్చే శనివారం ఈ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. పండక్కి వచ్చిన బంధువులంతా ఈ కల్యాణం తిలకించి వెళ్లడం అనాదిగా వస్తోంది. ఈ సందర్భంగా శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు ఉదయం నుంచి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ ఘట్టాన్ని వేదపండితులు నేత్రపర్వంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. డొంకాడ, దోసలపాడు, చీడిక, సీతానగరం, జగన్నాథపురం, గొడిచర్ల, కొత్తూరు, రమణయ్యపేట తదితర గ్రామాల భక్తులు కల్యాణం తిలకించేందుకు తరలి వచ్చారు. ముందుగా స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు.

రేపటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు



ఏడీ నరేష్

కోటవురట్ల: మాకవరపాలెం, కోటవురట్ల మండలాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టరు పెట్ల నరేష్ శనివారం తెలిపారు. ఈ శిబిరాల్లో పశువులకు, దూడపెయ్యలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు, కోళ్లకు టీకాలు వేస్తామన్నారు. అనారోగ్యం లేదా గర్భకోశ వ్యాధితో ఉన్న పశువులకు ఉచితంగా చికిత్స అందిస్తామని తెలిపారు. ప్రతీ మండలంలో రోజుకు రెండు గ్రామాలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. ఇందు కోసం పశు వైద్యాధికారి, పశు వైద్య సహాయకుడు, రైతు సేవా కేంద్రంలోని పశు వైద్య సహాయకులతో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంతో పాడి పశువులు, గొర్రెలు, మేకలలో ఉత్పాదక శక్తి పెరుగుతుందన్నారు. పశువుల్లో ఈతకు ఈతకు మధ్య దూరం తగ్గించి ఏడాదికి ఒక దూడను పొందే అవకాశం ఉంటుందన్నారు.

రేపటి నుంచి లెప్రసీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు



మాట్లాడుతున్న డాక్టరు సంతోష్‌కుమార్



మాట్లాడుతున్న వైద్యాధికారి విమలగిరి

కోటవురట్ల: జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా ఈ నెల 20 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు వ్యాధిగ్రస్తులను గుర్తించనున్నట్టు కె.వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్ కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తారని తెలిపారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, చెవులపై, వీపుపై ఎదపై నొప్పిలేని బుడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు ఊడిపోవడం, కనురెప్పలు మూతపడకపోవడం, ముక్కుదిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, అరచేతులు, అరికాళ్లు స్పర్శ లేకపోవడం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. డాక్టరు స్వర్ణ రతీస, ఎంపీహెచ్ఈవోలు ఎస్.గోవిందరావు, టి.బుల్లిబాబు పాల్గొన్నారు.

మునగపాక: గ్రామాల్లో లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో శనివారం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. సీహెచ్‌వో దేవకాంత, హెచ్‌వీ సీతామహలక్ష్మి, హెచ్ఎస్ మళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పాయకరావుపేటలో నవోదయ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



నవోదయ పరీక్షకు హాజరయిన విద్యార్థులు

పాయకరావుపేట: పట్టణంలో జెడ్పీ పరిషత్ మాలికల ఉన్నత పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 191 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో -2 జి.రమేష్‌బాబు తెలిపారు. 40 మంది హాజరు కాలేదన్నారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా పెంటకోట జెడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం కె.ఎన్. సూర్యనారాయణ, సెంట్రల్ లెవెల్ పరిశీలకులుగా విశాఖపట్నం జీఎస్‌వీ లైబ్రేరియన్ ఎన్.జి.సత్యనారాయణ వ్యవహరించారు.

నక్కపల్లి: స్థానిక గురుకుల పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్షకు 240 మంది విద్యార్థులకు గాను 211 మంది హాజరయ్యారని సూపరింటెండెంట్ నాగన్న దొర తెలిపారు. బాలురు 18 మంది, బాలికలు 11 మంది హాజరు కాలేదన్నారు. తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంఈవోలు కుంచం నరేష్, వేమగిరి నూకరాజు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ శ్రీధరరెడ్డి బృందం తనిఖీ చేసింది.

మునగపాక: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నవోదయ ప్రవేశ పరీక్షకు 240 మంది విద్యార్థులకు గాను 33 మంది హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు సందర్శించారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్ష జరిగినట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద అన్ని రకాల సదుపాయాలు కల్పించారన్నారు. ఎంఈవో వేణుగోపాలరావు, హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీపుర్లు పట్టిన అధికారులు

పలు గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ ర్యాలీలు



కోటవురట్లలో వీధులను శుభ్రం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మునగపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



ఎస్.రాయవరంలో వీధులు శుభ్రపరుస్తున్న దృశ్యం

యలమంచిలి రూరల్: పట్టణంలోని రాజీవ్ క్రీడా మైదానంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. క్రీడా మైదానంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, తుప్పలను మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు, సచివాలయ ఉద్యోగులు తొలగించారు. మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతను పాటించాలని నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి మాట్లాడుతూ పట్టణాన్ని క్లీన్‌గా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం, సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు. మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. అనంతరం రహదారుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు చీపుర్లు పట్టి శుభ్రం చేశారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు వీధులను పరిశుభ్రం చేయాలన్నారు. సర్పంచ్ అనిల్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్వచ్ఛాంధ్ర –స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగునకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తహసీల్దార్ ఎస్. ఆదిమహేశ్వరరావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి మనోరమ తెలిపారు. ఎస్.రాయవరం, దార్లపూడి తదితర గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించి వీధులు, డ్రైనేజీలు శుభ్రపరచారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్.రాయవరం ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు రమేష్‌బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.



రాజీవ్ క్రీడా మైదానంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వైభవోపేతంగా గౌరీపరమేశ్వరుల మహోత్సవం



అమ్మవారి రథం వద్ద కోలాటం ఆడుతున్న మహిళలు



వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవంలో కాళీమాత నేలవేషం

అనకాపల్లి: వేల్పులవీధిలో గౌరీపరమేశ్వరుల మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేలవేషాలు, తప్పెటగుళ్లు, స్టేజ్ ప్రోగ్రాములు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎంపీ బీవీ సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మలసాల రమణారావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, కార్పొరేటర్లు మందపాటి సునీత జానకీరామరాజు, జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్ దంపతులు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలు ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేష్‌లు శాలువాలతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికలు అందజేశారు.



ఆలయం వద్ద ప్రసాదం పంపిణీ

ప్రసాద వితరణ..

అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకుని వేల్పులవీధిలో దివంగత పూసర్ల వేణుగోపాలరావు స్వగృహం వద్ద భక్తులకు 25 కేజీల పులిహోర, 20 కేజీల కొమ్ముశనగలు, అమ్మవారి ఆలయం వద్ద పలు సంఘాల ప్రతినిధులు, జక్కం బ్రదర్స్, పసుపులేటి ప్రకాష్ తదితరులు పులిహోర, కిచిడి, సత్యనారాయణస్వామి ప్రసాదాలు పంచిపెట్టారు. మరి కొంతమంది భక్తులు మెయిన్‌రోడ్డు, నెహ్రూచౌక్ జంక్షన్, కన్యకాపరమేశ్వరి ఆలయం, తదితర ప్రాంతాల్లో భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

ఉపాధి కల్పించాలని రైతులు, యువకుల ధర్నా

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామంలో ఉన్న ఇండియన్ మారీటైం విశ్వవిద్యాలయంలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ భూ నిర్వాసిత రైతులు శనివారం విశ్వవిద్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వంగలి గ్రామానికి చెందిన పెద్దలు, భూములిచ్చిన రైతులు ఆకుల గణేష్ తదితరులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఏర్పాటు సమయంలో స్థానికులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఇచ్చిన హమీని అమలు చేయాలన్నారు. భూసేకరణ సమయంలో గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని, గ్రామ రహదారిని విస్తరించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. వర్సిటీ నిర్మాణం పూర్తయి సుమారు 6 సంవత్సరాలైనా స్థానికులు, భూ నిర్వాసితులకు ఉపాధి కల్పించలేదన్నారు. అనేక మంది స్థానికేతరులకు ఉపాధి కల్పిస్తూ స్థానికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ విషయం పలు మార్లు ప్రజాప్రతినిధులు, కలెక్టర్, వర్సిటీ పెద్దలకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ఇటీవల స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేక ధర్నాకు దిగినట్లు తెలిపారు. వర్సిటీ పెద్దలు వచ్చి డిమాండ్లపై తమతో చర్చించారన్నారు. హౌస్ కీపింగ్, గార్డెనింగ్ ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారన్నారు. తమ డిమాండ్ల పరిష్కారానికి వర్సిటీ పెద్దల నుండి సానుకూల నిర్ణయం వచ్చేంత వరకూ ధర్నా కొనసాగిస్తామన్నారు.